# సూర్య
www.suryaa.com

ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా

గురువారం,5 సెప్టెంబర్ 2024 1


## బిజెపి సభ్యత్వ నమోదు ప్రారంభించిన కేంద్ర మంత్రి వర్మ



భీమవరం/పాలకొల్లు, మేజర్ న్యూస్: నరసాపురం పార్లమెంటు జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ భీమవరంలో పార్టీ కార్యాలయంలో జరుగుతున్న బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రం సందర్భంగా కేంద్ర ఉక్కు బారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ రెఫెరల్ లింక్ ద్వారా సభ్యత్వాన్ని నమోదు చేశారు. భారతీయ జనతా పార్టీ పాలకొల్లు పట్టణ శాఖ అధ్యక్షుడు జక్కంపూడి కుమార్ ప్రాథమిక సభ్యత్వాన్ని మంత్రి బిజెపి సభ్యత్వ నమోదుని ప్రారంభించారు,ఈ కార్యక్రమంలో జిల్లా నలమూలల నుంచి నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా వెంకటరత్నం



ముదినేపల్లి,మేజర్‌న్యూస్ : గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయిలో ఇచ్చే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎన్ వెంకటరత్నం ఎంపికయ్యారు. ముదినే పల్లి మండలం పెద్దగోన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నేతల వెంకటరత్నం ఎంపికయ్యారు. టీచర్స్ డే నాడు గురువారం జిల్లా కలెక్టర్, డీఈవోచే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకోనున్నారు. ఆయనకు పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

# అప్రమత్తంగా కొల్లేరు ముంపు ప్రభావిత ప్రజలు

**- జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, ఎమ్మెల్యే పర్యటన - మెడికల్ క్యాంపులు - బోటు ద్వారా నిత్యావసర సరుకులు**





**ఏలూరు/కైకలూరు,మేజర్‌న్యూస్:** ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలు, కృష్ణానది, బుడమేరు నుంచి వస్తున్న జలప్రవాహాలతో కొల్లేరు సరస్సుకు వరదముంపు పొంచివున్నందున ముంపున కు గురైయ్యే ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయడానికి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ ఏలూరు రూరల్ మండలం కోమటిలంక గ్రామం వద్ద వరద పరిస్థితిని పరిశీలించారు. అక్కడ ప్రజల సమస్యలను గ్రామ సర్పంచ్,కొల్లేరు సరస్సు అధ్యక్షులు, గ్రామ పెద్దలు, ప్రజలతో కలెక్టర్ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కృష్ణానది వరద నీరు పెరుగుతున్న దృష్ట్యా కొల్లేరు వరద ప్రాంతాల ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోను రెండు రోజులపాటు గ్రామాల్లోనే వారి నివాసాల్లోనే ఉండాలని,బోట్లు ద్వారా ప్రయాణం నిషేధించామని తెలిపారు. గ్రామాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని,డాక్టర్ల పర్యవేక్షణలో క్యాంపులు నిర్వహిస్తారని, గర్భిణీ స్త్రీలను ముందుగానే పిహెచ్ సిలకు తరలించామని తెలిపారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ కోమటిలంకకు సంబంధించిన రోడ్డు నిర్మాణానికి గతంలో ప్రభుత్వాని ప్రతిపాధనలు పంపి నిధులు మంజూరు చేయించానని,ఫారెస్టు డిపార్ట్ మెంట్ వారి అనుమతులు లేనందున పనులు జరగలేదని,అధికారులతో చర్చించి పనులు ప్రారంభించాలని కోరారు.

జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ గ్రామాల్లో విఆర్‌ఓలతో పాటు పోలీస్ సిబ్బందికూడా గ్రామాల ప్రజలు బోట్లుమీద ప్రయాణించ కుండా పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. అనంతరం మండవల్లి మండలం పెద్దఎడ్లగాడి,మలుగునూరు వంతెన వద్ద కొల్లేరు వరద నీటికి అడ్డుగా వున్న గుర్రపుడెక్కను ఇరిగేషన్ శాఖ వారు ప్రొక్లేన్ ద్వారా తొలగించే పనులను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డిఓ ఎన్ఎస్ కె ఖాజావలి,ఇన్‌చార్జి తహశీల్దార్ శ్రీనివాసరావు, యంపిడివో బండి ప్రణవి, ఇరిగేషన్, పోలీస్,ఫారెస్టు అధికారులు, గ్రామ పెద్దలు తదితరులు ఉన్నారు.

## వరద బాధితులకు
# ఎమ్మెల్యే 'బడేటి' ఆపన్నహస్తం

- బాధితులకు దుప్పట్లు, టవల్స్ పంపిణీ
- 'చంటి ' సేవలు స్ఫూర్తిదాయకమన్న మంత్రి పార్ధసారధి



**విజయవాడ/ఏలూరు,మేజర్‌న్యూస్:** విజయవాడ వరద బాధితులకు ఆహారంతోపాటు వస్త్రాలు అందించిన ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి)ని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్ధసారధి ప్రత్యేకంగా అభినందించారు. విజయవాడలో వరద బాధితులకు ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఏర్పాటు చేసిన దుప్పట్లు, టవల్స్‌ను బాధితులకు అందించే కార్యక్రమంలో రాష్ట్ర మంత్రికొలుసు పార్ధసారధి పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆపన్నహస్తం అందిస్తున్న బడేటి సేవలు నిరుపమానమన్నారు.వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూవరదల్లోచిక్కుకున్నవారికి ఆపన్న హస్తం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గత మూడు రోజులుగా రాష్ట్రమంత్రి కొలుసు పార్ధసారధి ఆధ్వర్యంలో విజయవాడ నగరంలోని 10 డివిజనల్లో బాధితులను ఆదుకునే కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఏలూరు నుంచి30వేల కుటుంబాలకు అవసరమైన ఆహార పొట్లాలను అందించామన్నారు.అయితే కొంతమంది బాధితులు తాము కట్టుబట్టలతో బయటకు వచ్చామని చెప్పారని,దీనిని దృష్టిలో ఉంచుకొని వెయ్యి కుటుంబాలకు దుప్పట్లు, టవల్స్‌ను మంత్రి సమక్షంలో బాధితులకు అందిస్తున్నామన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్రమంత్రి నారాలోకేష్ వరద బాధితులను ఆదుకునేందుకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు.

## ముంపు ప్రాంతాల ప్రజలు సురక్షిత గ్రామాలకు వెళ్లాలి

**- వరద ఉదృతిని పరిశీలించిన కలెక్టర్,ఎస్పి**



**మండవల్లి,మేజర్ న్యూస్:** పెద్ద ఎడ్లగాడి వద్ద రోడ్డు మీద ప్రవహిస్తున్న వరద ఉదృతిని పరిశీలించి ముంపుకి గురైన గ్రామాల ప్రజలను సురక్షిత గ్రామాలకు వెళ్లాలని, భారీ వర్షాలకు ఎగువ నుంచి కొల్లేరుకు వరద నీరు చేరుతుందని బుధవారం ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి,ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్ద ఎడ్లగాడి - పెనుమాకలంక రహదారి కొల్లేరు వరద నీటికి మునిగిందని, పెద్ద ఎడ్లగాడి వంతెన దిగువన ఈ గ్రామాలు ఉండడంతో వరద నీరు వెనక్కి ముంచెత్తే అవకాశం ఉందని తెలిపారు.ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అధికారులకు వరదల సహాయ కార్యక్రమ సమయంలో సహకరించాలి అని తెలిపారు. ఎన్డీఏ నాయకులు చాపరాల దుర్గాప్రసాద్, సజ్జ సురేష్ బాబు ఆధ్వర్యంలో గత మూడు రోజుల నుంచి రెండు భారీ ప్రోక్లైన్‌లతో గుర్రపుడెక్క తూడు తొలగించడం జరుగుతుందని,లోతట్టు ప్రాంతాలకు వరద నీరు వెళ్లకుండా చూస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ వడ్డీ సాధికారిక కన్వీనర్ బలే ఏసు రాజు, రెవెన్యూ సిబ్బంది, పోలీసు సిబ్బంది,అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు అభినందనలు





**మండవల్లి,మేజర్‌న్యూస్:** ఉపాధ్యాయ వృత్తిలో కొన్ని సంవత్సరాలుగా విశేష కృషి చేస్తున్న ఉపాధ్యయలుకి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం ఎంతో హర్షణీయం.మండవల్లి మండలం నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఇద్దరు ఎంపిక అయ్యినారు.మండవల్లి మండలం అయ్యవారి రుద్రవరం గ్రామంలోని ఎంపీపీ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు చిరిగిరి పిచ్చోడు,పి.బి.సారమ్మ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక అయ్యారు.వీరికి రేపు ఏలూరులోని జెడ్పీ హాల్ నందు జిల్లా కలెక్టరు మరియు జిల్లా అధికారులచే అవార్డు అందుకోబోతున్నారు.ఈ విషయంతెలిసిఉపాధ్యాయుల విధి నిర్వహణను, సేవ కార్యక్రమాలను ప్రశంసిస్తూ తోటి సహోద్యోగులు, గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

## 304 మద్యం బాటిళ్లు తరలిస్తున్న వ్యక్తి అరెస్టు, రిమాండ్



**నూజివీడు,మేజర్ న్యూస్:** నూజివీడు ఇన్చార్జ్ డీఎస్పీ డి శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో నూజివీడు టౌన్ సిఐ మూర్తి సిబ్బందితో కలిసి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అన్నవరం బైపాస్ వెహికల్ చెకింగ్ నిర్వహించగా అటుగా వస్తున్న ఒక వ్యక్తి వస్తున్న స్కూటీని చెక్ చేయగా అందులో 167 బాటిల్స్,(30 ఫుల్ లు,137 క్వార్టర్ లు)మద్యం అక్రమముగా రవాణా చేస్తున్నట్టు గమనించారు.అతనిపై కేసు నమోదు చేసి సదరు వ్యక్తిని బుధవారం కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి రిమాండ్ 14 రోజులపాటు విధించారు.

# అధిక వర్షాలు,వరదలు ఎదుర్కొనేందుకు ప్రణాళిక

**- అధికారులకు జిల్లా కలెక్టర్ నాగరాణి ఆదేశం**




**భీమవరం,మేజర్‌న్యూస్:** స్థానిక కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరం నందు బుధవారం జిల్లా కలెక్టర్‌చదలవాడనాగరాణి జిల్లా అధికారులతో సమావేశమై రానున్న రెండు రోజుల్లో పొంచి ఉన్న అల్పపీడనం కారణంగా ముందస్తు చర్యలు పై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఇరిగేషన్ అధికారులు ఆనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు.

గట్లు బలహీనంగా ఉన్న ప్రదేశాలను గుర్తించి పటిష్ట పరచడానికి వెంటనే చర్యలు తీసుకోవాల న్నారు. తూడు, కిక్కిస తొలగింపు పనులను వేగవంతం చేయాలన్నారు. ఏఈలు క్షేత్రస్థాయిలో ఉండిపర్యవేక్షణ చేయాలన్నారు. గట్ల బలహీనతపై ఏదైనా సమాచారం అందితే వెంటనే అక్కడకు చేరుకునేలా ఉండాల న్నారు. అవసరమైన మెటీరియల్‌ను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పౌరసరఫరాల అధికారులు కొవ్వొత్తులు, అగ్గి పెట్టెలు పెద్ద ఎత్తున సరఫరా చేసే వెండర్స్ ను గుర్తించి సిద్ధంగా ఉండాలన్నారు. నిత్యవసర వస్తువులు పిడిఎస్ పాయింట్లు కూడా స్టాక్ నిల్వ ఉంచుకోవాలని సూచించారు. పంచాయతీల్లో, పట్టణాల్లో పారిశుద్ధ్య లోపం ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. త్రాగునీటి పైప్‌లైన్స్‌లో డ్రెయిన్ నీరు కలవకుండా జాగ్రత్త తీసుకోవాలని,లీకేజీలను గుర్తించి వెంటనే కట్టడి చేయాలన్నారు. క్లోరినేషన్ చేయకుండా ఎట్టి పరిస్థితుల్లో తాగునీటిని సరఫరా చేయకూడదని ఆదేశించారు.ఈసమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ జె.ఉదయభాస్కరరావు, తాడేపల్లిగూడెం ఇన్చార్జి ఆర్డీవో, కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి,తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాలు పేదల పాలిట వరాలు

**- ఎమ్మెల్యే నాయకర్,నాయుడు**



**నర్సాపురం,మేజర్‌న్యూస్:** ఉచిత వైద్య శిబిరాలు పేదలపాలిట వరమని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి యతి రాజ రామ్మోహన్నాయుడు అన్నారు. బుధవారం స్థానికఅశ్వని ఆసుపత్రి నిర్వాహకులు మాధంశెట్టి కోటేశ్వరరావు పద్మావతి దంపతులు గ్రంధి విజయలక్ష్మి సత్యనారాయణల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఉచిత మెగా క్యాన్సర్ వ్యాధి నిర్దారణ శిబిరాన్ని ఎమ్మెల్యే నాయకర్, కొవ్వలి రామ్మోహన్నాయుడులు ప్రారంభించి మాట్లాడారు. నరసాపురం నియోజకవర్గ ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకొని అశ్వని ఆసుపత్రి నిర్వాహకులు పద్మావతి, కోటేశ్వరరావులు క్యాన్సర్ నిర్ధారిత శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీమన్నారు. సమాజానికి గత 14 ఏళ్ల నుంచి డాక్టర్ పద్మావతి ఆమె తల్లిదండ్రులు విజయలక్ష్మి, సత్యనారాయణల పేరుమీదుగా వివిధ సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు.

ప్రతి నెల ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఎంతోమందికి ఉచితంగా మందులు అందజేయడం గొప్ప విషయమ న్నారు.ఈ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బల్లమురళి,నరసింహారావు,పీఎస్ మూర్తి, బందెల రవీంద్ర, వలవల నాని,గంటా కృష్ణ,నిప్పులేటి తారక రామా రావు, పోలిశెట్టి నలిని, పోలిశెట్టి సాంబ, ఐఎంఏ అండ్ ఐడిఏ సభ్యులు నియోజకవర్గజనసేన, టిడిపి, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# జనసైనికుడు పోసి బాబు మృతికి సంతాపం

**- కుటుంబానికి రూ.1లక్ష విరాళం**



**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** ద్వారకా తిరుమల గ్రామానికి చెందిన జనసైనికుడు పోసి బాబు మృతికి సంతాపం వ్యక్తం చేసిన జనసైనికులు అతని కుటుంబానికి రూ.1లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. గోపాలపురం నియోజకవర్గం ఇంచార్జ్ దొడ్డిగర్ల సువర్ణ రాజుచే మృతుడి సోదరుడికి పోస్ట్ ఆఫీస్ డిపాజిట్ బుక్స్ బుధవారం అందజేశారు. మృతుడు పోసి బాబు కుటుంబానికి పోలీసు వారు 55వేలు,జనసేన పార్టీ ఇన్చార్జి సువర్ణ రాజు 5వేలు, ద్వారకా తిరుమల గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకుడు శివకుమార్ 10వేల రూపాయలు,జనసేన పార్టీ మండల అధ్యక్షులు దాకారపు నరసింహమూర్తి 5వేలు రూపాయలు, పార్టీ ఉపాధ్యక్షులు చిలుకూరి ఫణి 5వేలు రూపాయలు, ద్వారకా తిరుమల గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకులు కోపల్లి గోపి 5వేల రూపాయలు, తరగల శ్రీనివాసరావు 5వేలు రూపాయలు, రామన్నగూడెం జనసేన పార్టీ నాయకులు జుత్తుగా శ్రీనివాసరావు 5వేలు రూపాయలు,జి కొత్తపల్లి జనసేన పార్టీ అధ్యక్షుడు మధుబాబు, జనసేన పార్టీ నాయకులు తోటకూర నాగేశ్వరరావు,రెడ్డి వెంకటేశ్వరరావు తదితరులు 5వేలు రూపాయలు కలిపి రూ.1లక్ష రూపాయలు మృతుడు కుమార్తె పేరుతో డిపాజిట్ చేసి పుస్తకాలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఇన్చార్జి సువర్ణ రాజు మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి ఎప్పుడు జనసేన పార్టీ అండగా ఉంటుందన్నారు. మృతుడి కుమార్తెను బాగా చదివించి మంచి ప్రయోజకురాలుగా తీర్చిదిద్దారని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు అంజి బాబు, జనసేన నాయకులు కోపల్లి తులసి, మండల పార్టీ ఉపాధ్యక్షులు వీరేంద్ర, కేసురెడ్డి శేఖర్ తదితర జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గురువులకు సత్కారం



**పాలకొల్లు,మేజర్‌న్యూస్:** స్థానిక జి.వి.ఎస్వి.ఆర్.ఎం.మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో, పాలకొల్లు సప్తనిధి లిమిటెడ్ ఫౌండర్ క్లబ్ చైర్మన్ స్వామి నాయుడు ఆధ్వర్యంలో బుధవారం గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా సప్తనిధి లిమిటెడ్(క్వేజీబ్యాంక్)ఫౌండర్ కమ్‌చైర్మన్‌స్వామి నాయుడు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానం వైపుగా తీసుకు వెళ్లే శక్తి ఒక్క గురువుకే ఉందన్నారు. తల్లిదండ్రుల తర్వాత గురువులు దైవంతో సమానమని సకల శాస్త్రాలు చెబుతున్నాయని అన్నారు. విద్యా రంగంలో విశేష సేవ అందిస్తూ విద్యార్థులను ఉన్నత స్థితిలోకితీసుకువచ్చిన నారాయణ రావు మాస్టారు,పాలకొల్లు మండలంలో పనిచేస్తున్న ఉన్నమట్ల చిన్నయ్య, పాలకొల్లు పట్టణం జీవీఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా సేవలందిస్తున్న రాయపూడి భవానీ ప్రసాద్ లను మెమొంటోలు అందజేసి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ హేమచంద్రరావు, రాంకీరెడ్డి, బ్రాంచ్ డెవలప్మెంట్ మేనేజర్ కిరణ్ కుమార్ పిల్లి, సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా రామోజీరావు ఎంపిక



**కైకలూరు,మేజర్ న్యూస్ :** ఏలూరు జిల్లా: కైకలూరు మండలం, గోనెపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న విశ్వనాధుని రామోజీ రావు 2024 సంవత్సరానికి ఏలూరు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక య్యారు. 2010 నవంబరు 6 తేదీన చాట్రాయి మండలం యర్రా వారి గూడెం ప్రాథమిక పాఠశాల నుండి తన సర్వీసును ప్రారం భించి 2015 సాధారణ బదిలీలలో భాగంగా మండవల్లి మండలం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల చింతపాడుకు బదిలీ కావడం జరిగింది.

అక్కడ నుండి 2023 సాధారణ బదిలీల్లో భాగంగా కైకలూరు మండలం గోనేపాడుకు బదిలీగా వచ్చి ప్రస్తుతం ఇక్కడే పని చేయడం జరుగుతుంది. 2017 ఉపాధ్యాయులకు ఇచ్చినటువంటి వృత్యంతర శిక్షణా కార్యక్రమాలకు జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్‌గా పని చేయడం జరిగింది అదేవిధంగా టి ఎ ఆర్ ఎల్ కోఆర్డినేటర్‌గా, 2023లో జరిగిన జ్ఞాన జ్యోతి జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్‌గా సేవలందించడం జరిగింది. కాగా విద్యార్థులను ఆదర్శ పౌరులుగా తీర్చిదిద్దడానికి తన వంతు కృషి చేయడం జరుగుతుందని రామోజీరావు తెలిపారు.

## నేడు ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొననున్న మంత్రి పార్ధసారధి

**ఏలూరు, మేజర్‌న్యూస్:** ఏలూరు జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్న ఉపాధ్యాయ దినోత్సవంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి మంత్రి కొలుసు పార్థసారధి పాల్గొంటారు.

ఈనెల 5తేదీ గురువారం ఉదయం 10.30 గంటలకు ఏలూరు చేరుకుంటారు. అనంతరం ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొని, తదుపరి ఉదయం 11.30 గంటలకు పిఎఫ్ చందదారులకు ప్రావిడెంట్ ఫండ్ బ్యాలెన్స్ షీట్‌లు అందజేస్తారు.

## వరద బాధితులకు సెయింట్ జాన్ వెల్ఫేర్ సొసైటీ చేయూత



విజయవాడ/ఏలూరు,మేజర్ న్యూస్ : విజయవాడ వరద బాధితులకు ఏలూరుకు చెందిన సెయింట్ జాన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు పెరికె వరప్రసాదరావు ఆధ్వర్యంలో వెయ్యి మందికి పైగా క్యాండిల్స్,బిస్కెట్ ప్యాకెట్ లు,పాల ప్యాకెట్లు పంపిణీ చేశారు. విజయవాడలో సింగ్ నగర్ కండ్రికలో ప్రజల పరిస్థితి దారుణంగా మారిందని, వరద జలప్రళయం సృష్టించిందని, అనేక జీవాలు కూడా జలసమాధి అయ్యాయని, అక్కడ వరద బీభత్సం పరిస్థితులను చూసి చలించిపోయామని ప్రసాదరావు పేర్కొన్నారు. వరద బాధితులను ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని, క్లీన్ అండ్ గ్రీన్ తక్షణమే అమలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మా స్వచ్ఛంద సంస్థల సహకారం ప్రభుత్వానికి ఉంటుందని తెలిపారు.

## గణపతి ఉత్సవాలకు ఏర్పాట్లు



**కైకలూరు: మేజర్ న్యూస్:** భక్తితో గణపతి నవరాత్రులు మహెూత్సవాలను ఘనంగా నిర్వహించడం కోసం ఉత్సవ కమిటీ వారు తగు ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆదేశాల మేర కైకలూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ దగ్గర ఎన్డీఏ కూటమి నాయకులు రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి పూల రామచంద్రరావు (రాజి) జనసేన నాయకులు కొల్లి వరప్రసాద్ (బాబి) కలిసి కొబ్బరికాయ కొట్టి పందేళ్లు ప్రారంభించారు. పూల రాజి మాట్లాడుతూ వినాయక స్వామి వారి ఉత్సవాలకు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వినాయక మండపాలు కమిటీ వారు ఏర్పాటు చేశారన్నారు. ఈ ఉత్సవాలలో స్వామివారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి ప్రతి ఒక్కరు స్వామి అనుగ్రహం పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

# పునరావాస కేంద్రాలకు తరలి రావాలి





– ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకున్న జేసి ధాత్రి రెడ్డి

కుక్కునూరు,మేజర్ న్యూస్ : భద్రాచలం వద్ద గోదావరి నదికి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలిరావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి విజ్ఞప్తి చేశారు. కుక్కునూరు మండలం గొమ్ముగూడెం, దాచారం, నెమలిపేట ఆర్అండ్ఆర్ కాలనీలలో ప్రజల ఇళ్లవద్దకుబుధవారంవెళ్లివారిసమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా జేసీ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ గోదావరి నదికి వరద ఉధృతికి ఎక్కువగా ఉన్నదని, భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయడంతో లోతట్టు ప్రాంతాలకు మునిగే ప్రమాదం ఉండడంతో ప్రజలు తమ ఇళ్లను విడిచి పునరావాస కేంద్రాలకు తరలి రావాలని, అధికారులకు సహకరించాలని కోరారు. అనంతరం కుక్కునూరులో ఏర్పాటుచేసిన వైద్య కేంద్రాన్ని జేసీ పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత త్రాగునీరు ప్రజలకు అందించేలా, పారిశుధ్య పరిస్థితిలుఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను జేసీ ఆదేశించారు.

కోయిదా ఫీడర్ పరిధిలో కోయిదా,రుద్రమకోట, కట్కూరుల్లో జనరేటర్లు అందుబాటులో ఉంచడం జరిగిందని జేసీ చెప్పారు. జేసీ వెంట రెవిన్యూ, పంచాయతీరాజ్, అధికారులు, స్థానిక ప్రజల ప్రతినిధులు పాల్గొన్నారు.

## దాతలు ముందుకు రావడం అభినందనీయం : 'గన్ని'



భీమడోలు,మేజర్ న్యూస్: విద్యార్థులను ప్రోత్సహించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని, టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, పొలసానిపల్లి గ్రామ సర్పంచ్ షేక్ రహీమా బేగం హసేన అన్నారు.గ్రామానికి చెందిన టిడిపి ప్రముఖులు డి.సత్యనారాయణ ఇటీవల కాలంలో చనిపోయారు. ఆయనసంస్కరణార్థం కుటుంబ సభ్యులు విద్యార్థులకు వాటర్ బాటిల్స్ పంపిణీ కార్యక్రమం,గ్రామంలో పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. పొలసానిపల్లిలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సర్పంచి రహీమా బేగం హసేన,గన్ని వీర ఆంజనేయులు వాటిని పంపిణీ చేశారు.మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వరద బాధితులకు ఆహార పొట్లాలు తరలింపు





ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్: విజయవాడ వరద బాధితులకు ద్వారకాతిరుమల తెలుగుదేశం పార్టీ నాయకులు 4వేలు పులిహెూర ప్యాకెట్లు, అలాగే చిన్న వెంకన్న దేవస్థానం 5500 సాంబారు ప్యాకెట్లు 6వేలు వాటర్ ప్యాకెట్లను బుధవారం ఉదయం రవాణా చేశారు. చిన్న వెంకన్న ఆలయ ఈవో వేంద్ర త్రినాధరావు, స్థానిక ఎస్సై సుధీర్ ఆహార పట్ల వ్యాన్లను జండా ఊపి రవాణా చేశారు. ప్రకృతి వైరుధ్యాల సమయంలో ఆపన్న హస్తం అందించడానికి దాతలు ముందుకు రావాలనివారు తెలియజేశారు. ఈక్రమంలో సూపర్డెంట్ డివియన్ రాజు,నటరాజ్, శ్రీనివాసు ,తెలుగుదేశం పార్టీ నాయకులు చెలికాని సోంబాబు,ఇమ్మడి రత్నాజీ, కూరాకుల వీర వెంకట సత్యనారాయణ, చిలకరెడ్డి, రేవూరి వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి ప్రవీణ్,కొత్త పల్లి సుబ్బారావు, జనసేన నాయకులు, బిజెపి నాయకులు, పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే బాలరాజు





**వేలేరుపాడు,మేజర్ న్యూస్ :** మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పోలవరం నియోజక వర్గ ఎమ్మెల్యే చిర్రి బాలరాజు బుధవారం పర్యటించారు. రహదారి సౌకర్యం లేని పేరంట పల్లి ,టేకుపల్లి గ్రామాలను లాంచి సహాయంతో సందర్శించి గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బియ్యం,కందిపప్పు ,పంచదార, ఉల్లి,దుంపలు మంచి నూనె నిత్యావసర వస్తువులను గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజా జీవనంలో మమేకమై వారి సమస్యల పరిష్కారం కోసం ఎల్ల వేళల కృషి చేస్తోందని అన్నారు. వరద వలన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,మేము అండగా ఉంటామని భరోసా కల్పించారు. అల్పపీడనం వలన వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు ఇళ్లకే పరిమితం అవ్వాలని, వాగులు నదులు పొంగి ప్రవహిస్తున్నాయని ప్రజలు జాగ్రత్తగాఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేనా జిల్లా కార్యదర్శి జి.రవి కుమార్, డ్వామా పీడీ రాము,ఆర్డిఓ అద్దయ్య,డీయస్ఓ రాజు,డీయల్పిఓ హస్మతుల్ల ,యంపిడిఓ మూర్తి, యంఆర్ఓ సత్యనారాయణ ,చల్లన్న దొర, జనసేనమండలఅధ్యక్షులుఆదినారాయణ పాల్గొన్నారు.

## వరద ప్రభావం తగ్గేవరకు అప్రమత్తత

- రెండవ ప్రమాద హెచ్చరికకు చేరే అవకాశం
- ముంపు గ్రామ ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలి
- అధికారులకు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశం



**ఏలూరు,మేజర్ న్యూస్ :** భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి నది వరద ఉధృతి నేపద్యంలో వరద ప్రభావం తగ్గేవరకు అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. వరద ఉధృతి రెండవ ప్రమాద హెచ్చరికకు చేరే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగం ,ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎటువంటి ప్రాణ నష్టానికి తావులేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు వరద ప్రభావం వలన కటాఫ్ అయ్యే నివాసిత ప్రాంతాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలన్నారు. పునరావాస కేంద్రాలను,వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడమే కాకుండా అన్ని సౌకర్యాలు ఉండేలా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. పునరావాస కేంద్రాల్లో నిత్యావసర సరుకులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ముంపు ప్రభావిత ప్రాంతాల్లోని నిండు గర్భిణీ, వృద్ధులను సురక్షిత ప్రాంతాలకు తరలించే కార్యక్రమాలను ముమ్మరం చేయాలన్నారు.

త్రాగునీటికి ఇబ్బంది లేకుండా వాటర్ప్యాకెట్లు వంటి సౌకర్యాలను అందుబాటులో ఉంచాలన్నారు. వరద సహాయక కార్యక్రమాల్లో ఎక్కడా ఏవిధమైన ఫిర్యాదులకు తావులేకుండా అధికారులు బాధ్యతతో పనిచేయాలన్నారు.

## రోడ్డు ఉండేందుకా - కొట్టుకుపోయేందుకా ?

– వర్షంలో రోడ్డు మరమ్మత్తు పనులు అవసరమా ?



**బుట్టాయిగూడెం,మేజర్న్యూస్ :** ఎక్కడైనా రోడ్ వేస్తే నాలుగు నెలలు రావాలని కోరుకుంటారుఇక్కడఅధికారులు పోవాలని కోరుకుంటున్నారో ఏమిటో తెలియడం లేదు. సంవత్సరాలు కొద్ది ఆగిన అధికారులు రెండు రోజులు ఆగలేకపోతున్నారు. ఒకపక్క జోరు వర్షం మరోపక్క హడావిడిగా రోడ్డు పనులు ఎందుకంటు ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వర్షంలో వేసిన రోడ్డు కొట్టుకుపోతుందన్న విషయం అధికారులకు తెలియదా ఏమిటంటు ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. కాంట్రాక్టర్ ని బాగు పెట్టేందుకా ఏమిటంటు ఆరోపిస్తున్నారు. వర్షాలకు రోడ్డు కొట్టుకుపోతే ఎవరు బాధ్యత వహిస్తారు అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇన్ని రోజులు లేని కంగారు ఇప్పుడు ఎందుకంటు సంబంధిత సిబ్బందిపై మండిపడుతున్నారు. ఇప్పటికే పెద్ద పెద్ద గోతులతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతుంటే వర్షంలో రోడ్డు వేసి మూడు రోజుల ముచ్చటగా చేసేందుకు అధికారులు కంకణం కట్టుకున్నారని ప్రజలు మండిపడుతున్నారు. బుట్టాయిగూడెం నుండి జంగారెడ్డిగూడెం వెళ్లే ప్రధాన రహదారికి ఇటీవలే మరమ్మతు పనులు ప్రారంభించారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో వర్షాలతో రోడ్లు కొట్టుకుపోతుంటే ఇక్కడ వర్షంలో రోడ్డు పనులు చేపట్టి అవార్డు కొట్టేయాలనుకుంటున్నారో ఏమిటో గానివర్షంలో చక చక రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. వర్షంలో రోడ్డు వేస్తే ఉంటుందో కొట్టుకుపోతుందో కూడా అధికారులకు తెలియడం లేదని ప్రజలు చెప్పుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నాణ్యమైన మరమ్మత్తుల రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# వరద బాధితుల కోసం విరాళాలు


- రూ.1.21 లక్షలు చెక్కు అందజేసిన సిపిఓ కార్యాలయం అధికారులు
- రూ.50 వేల చెక్కు అందజేసిన సాగిరాజు
- అండగా నిలుస్తున్న వారికి ధన్యవాదాలు : జిల్లా కలెక్టర్






**భీమవరం,మేజర్న్యూస్:** విపత్కర పరిస్థితుల్లో పెద్ద మనసు చాటుకున్న వారు ధన్యులని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు .బుధవారం స్థానిక కలెక్టరేట్ వశిష్ట సమావేశం అందరం నందు జిల్లా ముఖ్య ప్రణాళిక కార్యాలయం అధికారులు, సిబ్బంది జిల్లా కలెక్టర్ ను కలిసి వరద బాధితుల సహాయార్థం రూ.1.21 లక్షలు చెక్కును సిపిఓ ఎం.మోహన్ రావు చేతుల మీదుగా అందజేయగా, అలాగే ఉండి మండలం కలిగొట్ల గ్రామం నివాసి హైదరాబాదు ఐఐసీటీలో పనిచేస్తూ రిటైర్డ్ అయిన విశ్రాంత ఉద్యోగి సాగిరాజు వెంకట సత్యనారాయణ రాజు వారు దాచుకున్న సేవింగ్స్ నుండి రూ.50 వేల చెక్కును జిల్లా కలెక్టర్ చాంబర్ నందు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ విజయవాడ ఎదుర్కొంటున్న అకాల వరదలకు ప్రతి ఒక్కరూ తమకు తోచిన రీతిలో సహాయం చేయడం ఎంతో సంతోషించదగిన విషయం అన్నారు. చెక్కులను అందజేసిన వారికి వారి కుటుంబ సభ్యులకు జిల్లా కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంలో సిపిఓ కార్యాలయం అధికారులు, సిబ్బంది, సాగిరాజు వెంకట సత్యనారాయ రాజు మాట్లాడుతూ ఆపత్కాలిక సమయంలో సాయం అందించడం ప్రతి ఒక్కరి ధర్మం అన్నారు. ఈ సందర్భంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ జె.ఉదయ భాస్కరరావు, సిపిఓ ఎం.మోహన్ రావు, సిపిఓ కార్యాలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.


## వరద బాధితులను ఆదుకోవడానికి సర్వం సిద్ధం : ఎమ్మెల్యే బొలిశెట్టి





**విజయవాడ/తాడేపల్లిగూడెం,మేజర్న్యూస్:** ఇటీవల భారీ వర్షాలకు వరద ముంపుకు గురైన విజయవాడ పరిసర ప్రాంతాల ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వ యంత్రాంగం సంసిద్ధంగా ఉందని తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. విజయవాడ కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ లో ఆయన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాటు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్,గాజువాక ఎమ్మెల్యే పళ్ళ శ్రీనివాసులతో కలిసిపరిస్థితిని సమీక్షిస్తున్నారు. వరద బాధితులకు సహాయార్థం తాడేపల్లిగూడెం నియోజకవర్గం నుంచి ఎటువంటి సహాయక కార్యక్రమాలైనా చేయడానికి సిద్ధమంటూ ఆయన అధినాయకులకు సమాచారం ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ని కలిసిన అనంతరం ఆయన నేరుగా వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లి సహాయ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. తాడేపల్లిగూడెం నుంచి ఇప్పటికే లక్ష వరకు ఆహార ప్యాకెట్లు సిద్ధం చేసిన ఆయన వివిధ గ్రామాలు వివిధ స్వచ్ఛంద సేవాసంస్థల నుండి వాటర్ బాటిల్స్, బిస్కెట్ ప్యాకెట్స్ బ్రెడ్స్ వంటివి తాడేపల్లిగూడెం నుంచి తరలించేందుకు సిద్ధం చేస్తున్నామన్నారు. తాడేపల్లిగూడెంలోని దాతలు ఇంకా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అవసరమైతే వరద తీవ్రత తగ్గేంత వరకు విజయవాడలోనే ఉండి తాడేపల్లిగూడెం నుండి అవసరమైన ఆహార పదార్థాలను సమకూర్చేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

## వరద బాధితులకు నరసాపురం వైద్యులు రూ.1 లక్ష విరాళం



**నర్సాపురం,మేజర్న్యూస్:** ఐయంఏ,ఐడిఏ వైద్యసంస్థలు అందిస్తున్న సేవలు అభినందనీయం అని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. బుధవారం నరసాపురానికిచెందినఇండియన్మెడికల్ అసోసియేషన్ (ఐయంఏ),ఇండియన్ డెంటల్ అసోసియేషన్ (ఐడిఏ) సంస్థలు విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం సమకూర్చిన రూ 1 లక్ష చెక్కును ఐయంఏ అధ్యక్ష, కార్యదర్శులు బళ్ల మురళీ,యల్ నరసింహారావు, ఐడిఏ ప్రతినిధి పియస్ మూర్తిలు ఎమ్మెల్యే నాయకర్కు అందజేశారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సేవాభావంతోఉంటూఆపదలోఉన్నవారిని ఆదుకోవాలన్నారు. వరద ఉధృతికి విజయవాడ ప్రాంతంలో ఎంతోమంది నిరాశ్రయులయ్యారని అన్నారు. వారికి తమవంతు బాధ్యతగా ఐయంఏ, ఐడిఏవైద్య సంస్థలుఅందిస్తున్నసేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నిర్వహణ కార్యదర్శి కొవ్వలి యతిరాజ మోహన్ నాయుడు, డాక్టర్ లు మాదంశెట్టి కోటేశ్వరరావు,పద్మావతి,దేవికృష్ణ,శేషు కుమారి,జనసేన నాయకులు బందెల రవీంద్ర, వలవల నాని,గంటా కృష్ణ, నిప్పులేటి తారక రామారావు పోలిశెట్టి నలిని,పోలిశెట్టి సాంబ ఐడిఏ,ఐఎంఏ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## త్రాగునీరు, నిత్యవసరాలకు ఇబ్బంది లేకుండా చూడాలి





– అధికారులకు జెడ్పీ చైర్ పర్సన్ పద్మశ్రీ ప్రసాద్ ఆదేశం


పెదపాడు, మేజర్ న్యూస్ : పెదపాడు మండలంలో శివారు గ్రామలైన కొణికి, వడ్డీగూడెం లకు భారీగా బుడమేరు నుంచి వచ్చుచున్న వరద నీటి ప్రవాహాన్ని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మ శ్రీ ప్రసాద్ బుధవారం పరిశీలించి స్థానికులకు వరద నీటిఎద్దడిని ఎదుర్కొనేందుకు సూచనలు చేశారు. గత నాలుగు రోజులుగా పడుతున్న భారీ వర్షలకు ఎగువ నుండి వరద నీరు బుడమేరులోకి వచ్చుచునందున గత రాత్రి నుండి బుడమేరులో నీటి ప్రవాహం పెరిగి గట్లు తెగినందున స్థానికులు కొంత ఆందోళనకు గురికావడంతో ఈ ప్రాంతానికి నేరుగా వచ్చి పరిశీలించి కొణికి గ్రామస్తులకు ప్రభుత్వం అండగా ఉంటుందని చైర్ పర్సన్ ఘంటా పద్మ శ్రీ,ఆమె భర్త ప్రసాద్ ధైర్యం చెప్పారు. గ్రామస్తులు జడ్పీ చైర్ పర్సన్ తో మాట్లాడుతూ గడచిన 40 ఏళ్లలో ఎన్నడూ ఇంతటి భారీ నీటి ప్రవాహాన్ని బుడమేరులో చూడలేదన్నారు. ఈ విషయమై చైర్ పర్సన్ పద్మ శ్రీ ప్రసాద్ స్పందిస్తూ త్రాగు నీరు, నిత్యావసరాలకు ఇబ్బంది రాకుండా చూడాలని స్థానిక అధికారులను ఆదేశించారు.

## భారీ వర్షాలకు పూరిల్లు నేలమట్టం



**కుకునూర్,మేజర్న్యూస్ :** భారీ వర్షాలు పేదరికాన్ని అతలాకుతలం చేసింది. శనివారం కురిసిన భారీ వర్షానికి కుక్కునూరు మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన పేరాల లక్ష్మయ్య తండ్రి భైరాగి,మారపాక పెద పున్నయ్యా తండ్రి భూషయ్య అను వారి ఇల్లు శనివారం కురిసిన భారీ వర్షాలకు తమ ఇల్లు నేలమట్టం అయ్యాయని భాదితులు తెలిపారు. అధికారులు పరిశీలించి తమకు న్యాయం చేయాలని భాదితులు వేడుకుంటున్నారు.

## వరద బాధితులకు డైమండ్స్ సహాయం




తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్: విజయవాడ నగరంలో జల దిగ్బంధంలో ఉన్న ప్రజలుకు 316జి జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు పిలుపు మేరకు తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్ తరుపున 20 బాక్సలు ఆహారం, నీరు, వస్త్రాలు అందించారు. లయన్ ఆదిలక్మి ఆధ్వర్యంలో డైమండ్స్ టీం స్థానిక కృష్ణవేణి హాస్పటల్ వద్ద నుండి 3 కార్లలో బయలుదేరారు. పేరిచర్ల ఫౌండేషన్. లయన్ డా దుర్గా ప్రసాద్. లయన్ రమాదేవి లయన్ మదన్ మోహన్ అగర్వాల్. లయన్ రత్నకుమారి లయన్ కమల తదితరులు సుమారు 20 బాక్సలు ఆహారం లయన్ ఆకుల సతీష్ 10 కేసులు వాటర్ బాటిల్స్ అందించారు. లయన్ న్యాయవాది ఆదిలక్మి టీం సభ్యులు స్వయం గా వెళ్లి అందచేయుటకు 3 కార్లల్లో తరిలి వెళ్లారు 316జి జిల్లా జిఎంఏ కో ఆర్డినేటర్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు జెండా ఊపి ప్రారంబించారు. ఈకార్యక్రమంలో లయన్ డా.సత్యనారాయణ.లయన్ దుర్గా ప్రసాద్ లయన్ చెన్నా రెడ్డిసతీష్ మొటూరి వెంకట రత్నం లయన్ జగజీవన్ తదితరులు కృష్ణవేణి హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

సూర్య
పశ్చిమ గోదావరి
గురువారం,
5 సెప్టెంబర్ 2024


## విస్తారంగా కురుస్తున్న వర్షాలకు కూలిన గోడ



**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్:** తాడేపల్లిగూడెం 14వ వార్డు సత్యనారాయణపేటలో మల్లారెడ్డి పెంకుటింటిలో 4 కుటుంబాలు నివసిస్తున్నారు. అది కొంచెం పాత ఇల్లు కావడంతో ఎడ తెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు, రాత్రినుంచి కురిసిన భారీ వర్షానికి గోడలు కూలిపోయాయి. ప్రాణాపాయం సంభవించినప్పటికిని నివాసం దెబ్బతింటుందో సమాచారం తెలుసుకున్న రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, తాడేపల్లిగూడెం పట్టణ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గొర్రెల శ్రీధర్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి ఆ నాలుగు కుటుంబాల సభ్యులను అక్కడ నుంచి వెంటనే ఖాళీ చేయించి ప్రక్కనే ఉన్న వేరే ఇళ్లల్లోకి తరలించి వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో 14 వ వార్డు తెలుగుదేశం పార్టీ కమిటీ సభ్యులు మరియు జనసేన పార్టీ సభ్యులు, గొర్రెల శ్రీధర్ యువసేన సభ్యులు ఉన్నారు.

## వరద బాధితులకు నిత్యావసరాలు



నరసాపురం,మేజర్ న్యూస్ : విజయవాడలోని వరద బాధితులకు అండగా నియోజకవర్గం తరపున నియోజకవర్గ శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ ఆధ్వర్యంలో 12 వేల మందికి రూ.20 లక్షల వ్యయంతో నిత్యావసర సరుకులు సిద్ధం ఏం చేస్తున్నారు. నియోజకవర్గ కూటమి నాయకులు జనసైనికులు, వీర మహిళలు, ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. త్వరలో వీటిని విజయవాడ పంపించడానికి ఏర్పాటు చేస్తున్నారు.

## వేలేరుపాడులో 8919936844 నెంబరుతో కంట్రోల్ రూం

### - 943 కుటుంబాలకు 25 కేజీల చొప్పున 23,575 కిలోల బియ్యం పంపిణీ



**జంగారెడ్డిగూడెం/వేలేరుపాడు,మేజర్‌న్యూస్:** జిల్లా కలెక్టర్ వారి ఆదేశాలతో 943 కుటుంబాలకు కుటుంబానికి 25 కేజీల చొప్పున 23,575 కిలోల బియ్యం పంపిణీ చేసినట్లు జంగారెడ్డిగూడెం ఆర్డీవో కె. అద్దయ్య తెలిపారు.బుధవారం వేలేరుపాడులో అన్ని శాఖల అధికారులతో ఆర్డీవో కె.అద్దయ్య వరద పరిస్థితిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ గోదావరి వరద ప్రభావితానికి యడవల్లి సమీపములో గల ఎద్దువాగు బ్రిడ్జి పై నీరు పొంగుటవలన ఎద్దువాగు పై గల కట్కూరు , కోయిదా గ్రామపంచాయతీలలో గల 15 గ్రామాల ప్రజలు గోదావరి వరద వలన నష్టపోయారని గుర్తించి జిల్లా కలెక్టర్ వారి ఆదేశముల మేరకు బుధవారం ఆయా గ్రామాలలో 943 కుటుంబా లకు 25 కేజీల చొప్పున 23,575 కిలోల బియ్యం, కిలో కందిపప్పు చొప్పున 943 కిలోలు, కిలో పంచదార చొప్పున 943 కిలోలు, లీటర్ పామాయిల్ చొప్పున 943 లీటర్లు, కేజీ ఉల్లిపాయిలు చొప్పున 943 కిలోలు,కేజీ బంగాళ దుంపలు చొప్పున 943 కేజీలు,5వేల మంచినీటి ప్యాకెట్లు అందించడం జరిగిందన్నారు. కోయిదా, టేకుపల్లి గ్రామలలో పోలవరం శాసన సభ్యులు చిర్రి బాలరాజు చేతుల మీదుగా ప్రారంభించి పై 15 గ్రామాలలో పంపిణీ పూర్తి చేయడమైనదన్నారు. సెంట్రల్ వాటర్ కమీషన్ వారు భద్రాచలం దగ్గర బుధవారం మధ్యాహ్నం మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసినందున వేలేరుపాడు మండలములో గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయడమైనదన్నారు. ఈ సందర్భంగా వేలేరుపాడులో అన్ని శాఖల అధికారులతో ఆర్డీవో కె.అద్దయ్య వరద పరిస్థితిపై సమీక్షించారు. వేలేరుపాడు తహాశీల్దారు కార్యాలయంలో ప్రజలు సౌకార్యర్థం 8919936844 ఫోన్ నెంబరుతో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో డ్వామా పిడి ఎ.రాము,తహాశీల్దారు డివి సత్యనారాయణ,చల్లన్నదొర, డిఎల్ పివో రజఉల్లా, యంపిడివో మూర్తి, ఇవోఆర్డి తదితరులు పాల్గొన్నారు.

## నడవడానికి వీలులేని
## కోడిపందాల దిబ్బ కాలనీ రోడ్లు





పెనుగొండ,మేజర్‌న్యూస్: ఇటీవల వర్షాలకు పెనుగొండ గ్రామం కోడిపందాలదిబ్బ రోడ్లన్నీ జలమయమై 300 కుటుంబాల ప్రజలు అనేక ఇబ్బందులుఎదుర్కొంటున్నామనికాలనీ నివాసి మాదాసు నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు.ఆయన మాట్లాడుతూ అనేకసార్లు పంచాయితీ దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయిందని, కాలనీవాసులే రోడ్లపైన గుంతలలో నీటిని దారి మళ్లిస్తున్నారు. నడవడానికి కూడా వీలు లేకుండా ఉన్న రోడ్లు చినుకు పడితే రోడ్లన్నీ చిత్తడి చిత్తడిగా ఉంటున్నాయని గత 24 సంవత్సరాలుగా పాలకుల నిర్లక్ష్యం వల్ల రోడ్లు నిర్మాణం చేపట్టలేదని ఆవేదనతో తెలిపారు. కనీసం రోడ్లపై గుంతలు పూడ్చి కాలనీవాసుల ఇబ్బందులు తొలగించాలని డిమాండ్ చేశారు. కాలనీలో త్రాగునీటి సమస్య పట్టిపీడిస్తున్నదని గతంలో పంచాయతీ వారు ట్యాంకులతో నీరు సరఫరా చేసేవారని ఇప్పుడు పూర్తిగా నిలిపివేశారని చెప్పారు. మా కాలనీ సమస్యలు పరిష్కారము చేయకపోతే ఆందోళనలుచేపడతామని తెలిపారు.

## 20 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు


**కుక్కునూరు,మేజర్‌న్యూస్ :** గోదావరి వరదలు వలన గొమ్ముగూడెం గ్రామములోని 218 కుటుంబాల వారిని దాచారం ఆర్ ఆర్ ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన సురక్షిత ప్రాంతం క్యాంపు తరలించుట అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసి,ప్రస్తుతానికి 20కుటుంబాల వారిని తరలించుట జరిగిందనని జంగారెడ్డిగూడెం ఆర్డీవో కె.అద్దయ్య తెలిపారు. లచ్చిగూడెం గ్రామస్తులకు రోడ్ కట్ ఆఫ్ అయ్యే పరిస్థితి ఉన్నందున అక్కడ ఉన్న 150 కుటుంబాల వారికి కుటుంబానికి 25 కేజీల చొప్పున3750 కేజీల బియ్యం,ఒక కేజీ కందిపప్పు చొప్పున 150 కేజీలూ,ఒక కేజీ పంచదార చొప్పున 150 కేజీలు, ఒకలీటర్ పామాయిల్ చొప్పున 150 లీటర్లు, ఒక కేజీ ఉల్లిపాయిలు చొప్పున 150 కేజీలు, ఒక కేజీ బంగాళదుంప చొప్పున 150 కేజీలు, 5 వేల మంచినీటి ప్యాకెట్లు ఉచితముగా పంపిణీ చేయుటకు జిల్లా కలెక్టర్, ఏలూరు కి ప్రతిపాదనలు చేయుట జరిగినదన్నారు. అటులనే సురక్షిత ప్రాంతం(రిలీఫ్ క్యాంపు)లోకి వచ్చిన గొమ్ముగూడెం గ్రామ బాధిత కుటుంబాల వారికి భోజన సదుపాయం కల్పించుటకు అన్ని రకాల ఏర్పాట్లు చేయుట జరిగినది.భద్రాచలంలో బుధవారం మధ్యాహ్నం మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అగుటవలన కుకునూర్ మండలములో గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయడమైనదన్నారు. ప్రతి గ్రామానికి సూపర్ వైజర్ ఆఫీసర్లగా మండల లెవెల్ అధికారులను నియమించడమైనదన్నారు.మండలములో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండ ప్రజలను అవసరమైతే సురక్షిత (ప్రాంతాల రిలీఫ్ క్యాంపు) లకు తరలించుటకు 10 మోటర్ బొట్లును సిద్ధముగా ఉంచడమైనదన్నారు. 35 ట్రాక్టర్లు కూడా సిద్ద చేశామన్నారు. మెడికల్ డిపార్ట్మెంట్లు వారిని మెడికల్ క్యాంపు నిర్వహించుటకు చర్యలు తీసుకోనవలసినదిగా మరియు గ్రామ పంచాయతీ సిబ్బందిని శానిటేషన్ ఎప్పటికప్పుడు చేయవలసినదిగా ఆదేశించడమైనదన్నారు. వరద పరిస్థితిని బట్టి ప్రజలను ఎప్పటి కప్పుడు అప్రమత్తం చేసి వరద సమయములో ప్రజలు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవడమైనది. తహాశీల్దారు కుకునూర్ వారి కార్యాలయములో ప్రజలు సౌకార్యర్థం 8309703949 ఫోన్ నెంబర్‌తో కంట్రోల్‌రూం ఏర్పాటు చేయడమైనదన్నారు. వరద ప్రభావం రీత్యా డ్యూటి వేసిన అధికారులు అందరూ వారికేటాయించిన గ్రామాలలో నివాసం ఉంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలియ పరుచుచున్నారన్నారు.విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడినచో తగు చర్య నిమిత్తం జనరేటర్లు సిద్ధం చేయడమైనదన్నారు.

## వరద బాధితులకు ఆక్వా డీలర్ల చేయూత



భీమవరం, మేజర్ న్యూస్ :విజయవాడ వరద బాధితులు సహాయార్థం ఆక్వా డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండువేల ఆహార పొట్లాలు, వాటర్ బాటిల్స్ ను బుధవారం జూలపాలెం రోడ్డు శ్రీ భగవాన్ టెండర్స్ కార్యాలయం వద్ద నుండి ప్రత్యేక వాహనంలో పంపడానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భీమవరం శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ వరద బాధితుల సహాయార్థం దాతలు ముందుకు రావ డం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆక్వా డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నడింపల్లి వెంకట రామరాజు, కార్యదర్శి వేగేశ్న రమేష్ రాజు, కడలి రమణ, వేస్పర్ వర్మ, వంశీ, అభిలాష్ వర్మ, జోగిరాజు, కిషోర్ రాజు, భగవాన్, నాగేశ్వరరావు, రంగరాజు, మంతెన రామ్ కుమార్ రాజు, పేరిచర్ల లక్ష్మణ వర్మ, నడింపల్లి మహేష్ కుమార్ వర్మ, కంతేటి వెంకటరాజు, గాదిరాజు సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

## కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడం మంచి పరిణామం



**భీమవరం, మేజర్ న్యూస్:** ఎదుటి వారికి కష్టాలు వచ్చినప్పుడు సహాయ సహకారాలు అందించడం మంచి పరిణామం అని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. విజయవాడ వరదల్లో చిక్కుకుని నాలుగు రోజులుగా కష్టాల్లో ఉన్న బాధితులకు భీమవరం డిఎన్ఆర్ కాలేజ్ విద్యాసంస్థలు డిగ్రీ, పాలిటెక్నిక్, బీటెక్ విద్యార్థులు స్వయంగా పాల్గొని మంచి సహాయ సహకారాలు అందించడం ఐదువేల ఆహార పొట్లాలు తయారు చేయించి వరద బాధితులకు పంపడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. పక్కవారికి కష్టాలు వచ్చినప్పుడు సహాయం చేయాలని మనస్తత్వం ఉండటం భవిష్యత్తులో మనకు మంచి జరుగుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.డిఎన్ఆర్ కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) ఉపాధ్యక్షులు గోకరాజు పాండురంగరాజు మాట్లాడుతూ విజయవాడ వరద బాధితులకు తమ విద్యాసంస్థలు ఎప్పుడు అండగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, సిబ్బంది, ఎన్సిసి, ఎన్ఎస్ఎస్ క్యాడెట్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ :ఎమ్మెల్యే చింతమనేని





**పెదపాడు,మేజర్ న్యూస్:** వరద బాధితులను ఆదుకోవటానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని, ఎలాంటి రాజకీయ పక్షపాతాలకు తావు లేకుండా, వరద ముంపుకు గురైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం తరపున అండగా ఉంటామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు.రామిలేరు వరద ముంపుకు గురైన పెదపాడు మండలం పరిధిలోని పలు గ్రామాలకు చెందిన దాదాపు 726 కుటుంబాలకు కూటమి ప్రభుత్వం తరపున నిత్యవసర సరుకులు అందించేలా చర్యలు చేపట్టారు.. బుధవారం సాయంత్రం పెదపాడు మండలం అప్పన్న వీడు గ్రామంలో జరిగిన నిత్యవసర సరుకులు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దాదాపు 500 కుటుంబాలకు స్వయంగా నిత్యవసర సరుకులు అందజేశారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ “వరద సహాయ చర్యల్లో కూటమి నాయకులు కార్యకర్తలు అధికారులు ఎంతో చురుకుగా పాల్గొంటూ ప్రజలకు తాము అండగా ఉన్నాం అనే భరోస కల్పించటం ఎంతో అభినందనీయం అన్నారు. వరద సహాయక చర్యల్లో భాగంగా పెదపాడు మండలంలోని పలు గ్రామాల్లో ముంపుకు గురైన దాదాపు 726 కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి 25 కేజీల బియ్యం, లీటర్ మంచి నూనె, కేజీ కంది పప్పు, కేజీ ఉల్లిపాయలు, కేజీ బంగాళా దుంపలు, కేజీ పంచదార చొప్పున తక్షణ సహాయాన్ని అందించడం జరుగుతుందని అన్నారు.

## తప్పిపోయిన బాలుడు అరగంటలో తల్లిదండ్రుల చెంతకు

### - ఏలూరు త్రీ టౌన్ పోలీస్‌ల కృషి



**ఏలూరు,మేజర్ న్యూస్:** ఏలూరు 3 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న మినీ బైపాస్ రోడ్డులో ఉదయం 11:30 గంటలకు పోసుపల్లి హర్ష తండ్రి రాజు 3 సంవత్సరంలు ఏలూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న హర్ష ఇంటి నుంచి తప్పిపోయి రోడ్డు మార్గంలో ఉన్న విషయాన్ని గమనించిన కొంతమంది ఏలూరు 3 టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కోటేశ్వరరావు కి సమాచారం అందించారు. ఆయన వెంటనే మహిళా పోలీస్ కానిస్టేబుల్ సుజాతకు బాలుని తల్లిదండ్రుల వివరాలను తెలుసుకొని తెలియచేయాలని ఆదేశించారు. మహిళా కానిస్టేబుల్ ఆ ఏరియాలో ఉన్న ఏ.ఎన్.ఎం సహాయంతో బాలుడు తల్లిదండ్రులు వివరాలు తెలుసుకొని వారికి సమాచారం తెలుసుకొని గొల్లాయి గూడెం సచివాలయం వద్ద సదరు బాలుడిని అప్పగించారు. బాలుడు తప్పి పోయినట్లు, వారు చుట్టుపక్కల వెతికిన జాడలు లేవని ఎంతో శ్రమతో ఒక అర గంటలో సమయంలో తప్పిపోయిన మా అబ్బాయిని ఏలూరు 3 టౌన్ ఇన్స్పెక్టర్ కోటేశ్వరరావు సురక్షితంగా అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని హర్ష తల్లిదండ్రులు పేర్కొన్నారు.

## మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే వినియోగించాలి



**భీమవరం,మేజర్‌న్యూస్:** పర్యావరణహితమైన మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే ప్రతి ఒక్కరు వినియోగించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు.బుధవారం పట్టణంలో జువ్వలపాలెం రోడ్డులోని శ్రీభగవాన్ ప్లాజా వద్ద జైత్ర బిజినెస్ సాల్యుషన్స్ (భీమవరం డాట్ కామ్), వెస్ట్ బెర్రీ స్కూల్, శ్రీ భగవాన్ ట్రేడర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 5 వేలు మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎమ్మెల్యే అంజిబాబు, జెసి రాహుల్ కుమార్ రెడ్డి పాల్గొని, వారి చేతులమీదుగా పట్టణ ప్రజలు, విద్యార్థులకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణి చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాలనే సంకల్పంతో వివిధ సంస్థల ఆధ్వర్యంలో ఆధ్వరంలో చేపట్టిన మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ అభినందనీయమన్నారు. ప్రస్తుతం కాలుష్య వాతావరణంలో మనిషి జీవిస్తున్నాడని, శబ్ద, జల, వాయు కాలుష్యాలతో అంతుపట్టని వ్యాధులు సంక్రమిస్తున్నాయన్నారు. వినాయక చవితి పూజలో మట్టి విగ్రహాలతోనే పూజించి పర్యావరాన్ని కాపాడాలని అన్నారు. పర్యావరణానికి ముప్పు రాకుండా వినాయకుని పండగ భక్తి శ్రద్ధలతో చేసుకోవాలని అన్నారు. రంగులు వేసిన విగ్రహాలు వలన పర్యావరణం దెబ్బతింటుందని పిల్లలందరూ అవగాహన చేసుకుని పర్యావరణానికి మంచి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. భీమవరం నియోజకవర్గ శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ భారతీయులందరూ సంప్రదాయంగా జరుపుకునే తొలి పండుగ వినాయక చవితి అని, ఆ చవితి వేడుకలకు వేలాది మట్టి విగ్రహాలను ఉచితంగా అందించడం గొప్ప విశేషమని అన్నారు. గత 11 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులు సుబ్బరాజును ఎమ్మెల్యే అభినందించారు.జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. మట్టి విగ్రహాలను పూజిద్దాం.. పర్యావరణాన్ని రక్షిద్దాం.. అనే నినాదంతో ప్రతిఒక్కరు ముందుకు సాగాలని అన్నారు.వెస్ట్ బెర్రీ స్కూల్ డైరెక్టర్ నడింపల్లి మహేష్ కుమార్ వర్మ, శ్రీభగవాన్ ట్రేడర్స్ నడింపల్లి వెంకట రామ రాజు, గాదిరాజు సుబ్బరాజు, శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు మాట్లాడుతూ వినాయక చవితి పండుగను మట్టి విగ్రహాలతోనే చేయాలనీ, మన పర్యావరణాన్ని మనమే రక్షించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కలిదిండి బలరామరాజు, ది భీమవరం ఆక్వా డీలర్స్ అసోసియేషన్ కార్యదర్శి వేగేశ్న రమేష్ రాజు,ఆదిత్య స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, మంతెన రామ్ కుమార్ రాజు, పేరిచర్ల లక్ష్మణ వర్మ, ఆశా కిరణ్, వెస్ట్ బెర్రీ పాల్గొన్నారు.

## నిర్లక్ష్యపు నీడలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి



జంగారెడ్డిగూడెం,మేజర్‌న్యూస్: రోగులనీ గాలికి వదిలేసిన డయాలసిస్ సిబ్బంది. జంగారెడ్డి గూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి డయాలసిస్ విభాగంలో పేషంట్ పై స్లాబ్ పెచ్చులు ఊడిపడి గాయాలయ్యాయిరోగికి 5 కుట్లు వేసిన సిబ్బంది.కూలిన స్లాబ్ క్రిందే మిగతా రోగులకు చేస్తున్న డయాలసిస్

## వైసిపి ఏలూరు ఇన్చార్జిగా జెపి



ఏలూరు,మేజర్‌న్యూస్ : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా మామిళ్ళపల్లి జయప్రకాష్ (జెపీ)నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి బుధవారం జెపిని నియమించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

## వరద బాధితుల కోసం ఎన్జీవోల వితరణ

### - విజయవాడకు ఆహార ప్యాకెట్లు సరఫరా



**ఏలూరు,మేజర్ న్యూస్:** ఏలూరు ఎఎస్సార్ స్టేడియం వద్ద ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్ నుంచి జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి సూచనల మేరకు విజయవాడలోని వరద బాధితుల కోసం ఎన్జీవోలు ఆహార ప్యాకెట్లతో ప్రత్యేక వాహనంలో బయలుదేరారు. ఉద్యోగులు, మిత్రులు. ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ జిల్లా కలెక్టర్ కు ఇచ్చిన విరాళ సహాయ నిధి నుంచి ఈ ఏర్పాటు చేశారు. విజయవాడ నగరంలో వరద భాధితుల సహయార్థం 1000 ఫుడ్ ప్యాకెట్ లు,5వేల వాటర్ ప్యాకెట్ లు,3వేల బిస్కెట్ ప్యాకెట్లు, 500 బ్రెడ్ ప్యాకెట్ లు, 500 బన్ లతో బయలుదేరిన ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్‌కి కేటాయించిన వాహనానికి జెండా ఊపి ఏలూరు మున్సిపల్ కమీషనర్ ఎ.భాను ప్రతాప్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు, కప్పల సత్యనారాయణ, జయరాజు, బేగ్,సత్య భారతి, తదితరులు పాల్గొన్నారు.

## ఆహార పొట్లాలు పంపడానికి
## 2 అంబులెన్సులు సౌకర్యం



**ఏలూరు,మేజర్ న్యూస్:** శాసనసభ్యులు బడే చంటి పిలుపుమేరకు ఏలూరు ఎస్ఎంఎస్ అంబులెన్స్ సర్వీస్ వారి ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులు 5 వేల మందికి ఆహార పొట్లాలు,సర్వీస్ చేయడానికి రెండు అంబులెన్సు పంపించినట్లు ఏలూరు నగర పాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు. శాసనసభ్యులు బడే చంటి పిలుపును అనుసరిస్తూ ఏలూరు చెందిన ఎస్ఎంఎస్ అంబులెన్స్ సర్వీస్ అధినేత రఫీ,నల్లజర్ల మీరావలి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం పవర్ పేటలోని శాసనసభ్యులు బడేటి చంటి క్యాంప్ కార్యాలయం వద్ద నుండి5 వేల ఆహార పొట్లాలు,సర్వీస్ చేయడానికి రెండు అంబులెన్సు విజయవాడ పంపించామని నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ ఎం ఆర్ పెదబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆవుపాడు మీరా,ఎస్ కే బషీర్,మౌలాలి,ఎస్.కే జావీద్,తెలుగు దేశం నాయకులు మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, కంప్యూటర్ ప్రసాద్,బొద్దాని శ్రీనివాసరావు,పప్పు ఉమామహేశ్వర రావు,రెడ్డి నాగరాజుపలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన సేవలందించాలి : జెసి



**జంగారెడ్డి గూడెం,మేజర్ న్యూస్:** ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన సేవలందించాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి వైద్యాధికారులకు సూచించారు. జంగారెడ్డి గూడెంలో ఏరియా ఆసుపత్రిని బుధవారం జేసీ ధాత్రిరెడ్డి ఆకస్మిక తనిఖీ చేసి,రోగులకు అందుతున్న వైద్య సేవలని పరిశీలించి, రోగులతో జేసీ మాట్లాడారు. ఈ సందర్భంగా జేసీ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా జంగారెడ్డి గూడెం పరిసర ప్రాంతాలలోని సామాన్య ప్రజలు విష జ్వరాల ప్రభావంతో మెరుగైన వైద్య చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయిస్తూ ఉంటారన్నారు.ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉన్నందున ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు వ్యాధి నిర్ధారణ చేసి వెంటనే చికిత్స అందించాలన్నారు.

వ్యాధి పూర్తిగా నయమైందని నిర్ధారణ అయిన తరువాత మాత్రమే రోగులను ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ చేయాలనీ జేసీ వైద్యాధికారులకు సూచించారు. జేసీ వెంట రెవిన్యూ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.